## చిన్నకథ

# రౌండ్ ఫిగర్

బుజ్జిబాబుకి ఏనాడో మూడు పదులు నిండి పోయాయి. ఇంకా పెళ్లి కాలేదు. సమీప భవిష్యత్తులో అవుతుందన్న నమ్మకం కూడా లేదు. తోటివాళ్ళంతా ఏనాడో పిల్లల తండ్రులైపో యారు. మరి తనే ఓ ఇంటివాడు ఎందుకు కాలేక పోతున్నాడు? చదువు లేదా?.. బి.ఇ. పాస య్యాడే!... పనిపాటు లేదేమో!... ఎందుకు లేదు? ఓ వెల్ ఎస్టాబ్లిష్డ్ కంపెనీలో ఇంజనీరుగా ఉద్యోగం వెలగబెడుతున్నాడు. పోనీ ఆడపిల్లల్ని ఆకర్షించగల పర్సనాలిటీ లేదేమో అనుకుంటే కాలేజీలో చదూకునే రోజుల్లోనే ఫ్రెండ్స్ అందరిలో తనే అందగాడన్న స్నేహితులి చ్చిన సర్టిఫికెట్టు ఉండనే ఉంది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు తనకి పెళ్లి కాకపోడానికి తండ్రి అత్యాశే కారణం. బిడ్డమీద పెట్టిన పెట్టుబడికి రెండింతలు కట్నం రూపంలో రాబట్టాల న్నది అతడి ఆకాంక్ష.

"ఏరా! నువ్వికి పెళ్లి చేసుకోదలచుకో లేదా? బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికి రావంటారు. చూస్కో జాగ్రత్త" స్నేహితుల, శ్రేయోభిలాషుల హెచ్చరికలు బుజ్జిబాబుని మరింతగా కృంగదీస్తున్నాయి.

మొన్నీమధ్య పిల్లని చూడటానికి తల్లి దండ్రులతో కలిసి కాకినాడ వెళ్ళొచ్చాడు. అమ్మాయి అప్సరసలా ఉంటుంది. అందులో సందేహం లేదు. పైగా కంప్యూ టర్స్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిందట. అడక్కుండానే ఆరులక్షలు ఆఫర్ చేసా రామె తల్లిదండ్రులు.

పిల్లను చూసి చూడటంతోనే నచ్చేసు కున్నాడు మన బుజ్జిబాబు. ఎలాగైనా తండ్రిని ఒప్పించి ఆ అమ్మాయితో తన వివాహం జరిపించమని సంబంధం పట్టు కొచ్చిన పేర్రాజును దీనంగా వేడుకు న్నాడు. ప్రతిఫలంగా తను కూడ అంతో ఇంతో ముట్టచెబుతానని ఆశ చూపిం చాడు. ఎందుకంటె నాన్న వాళ్ళు చెప్పిన అంకెకు ఒప్పుకోడని తెలుసు.


బుజ్జిబాబు మాటలకు మురిసిన పేర్రాజు పిల్ల తండ్రిని తన మాటల గారిడీతో బురిడీ కొట్టించి కట్నం మరో లక్షన్నరకు డేకిరించ గలిగాడు.

"అమ్మాయి లక్షణంగా ఉంది. అబ్బాయి ఇష్ట పడ్డాడు. ఇంకా తాత్సారం చెయ్యడం దేనికి ఒప్పే సుకోండి" అంటూ అలివేలు కూడ ఒత్తిడి చేయ డంతో సంబంధం ఖాయమైపోయినట్లు గానే తెగ సంబరపడిపోయాడు బుజ్జిబాబు. తనకాపిల్లతో పెళ్లి నిశ్చయమైతే కొండకొచ్చి తలనీలాలు సమ ర్పించుకుంటానని వేంకటేశ్వర స్వామికి మొక్కు కున్నాడు కూడ. అయితే ఏ దేవుడు అతడి మొర ఆలకించక పోవడంతో పిచ్చెక్కిపోయాడు బుజ్జి బాబు.

భార్యా బిడ్డల ఒత్తిడికి రవంత తలొగ్గినా రౌండ్‌ఫిగర్ పదిలక్షలిస్తే తప్ప సంబంధం ఓకే చేసేదిలేదని భీష్మించుకు కూర్చున్నాడు తాతాజీ. అయితే వాళ్ళు ఏడున్నర లక్షలకు మించి ఒక్క రూపాయి కూడ అదనంగా ఇచ్చేది లేదని కరాకం డీగా చెప్పేసారు.

దాంతో ఆ సంబంధం పుసిగిపోయిందను కున్నారంతా.

తనకిక జన్మలో పెళ్లి కాదని నిస్తేజంగా రోజులు వెళ్లదీస్తున్నాడు బుజ్జిబాబు.




ఇలా ఉండగా ఓ రోజు తాంబూలాలివ్వడానికి కాకినాడ నుంచి సడన్‌గా పెళ్లివారు దిగబడ్డారు.

తప్పిపోయిందనుకున్న సంబంధం ఖాయమై పోయింది.

బంధుజనమంతా అమితాశ్చర్యపోయారు.

ఇది కలా, నిజమా! అనుకుని చేయి గిచ్చు కుంది అలివేలు.

భగవంతుడు తన మొర విన్నందుకు ఎగిరిగెం తులేసాడు బుజ్జిబాబు.

రౌండ్‌ఫిగర్ పదిలక్షలిస్తే తప్ప పెళ్లికి అంగీక రించేది లేదని తెగేసి చెప్పిన తాతాజి రెండున్నర లక్షలు వదులుకోడానికి ఎందుకు సిద్ధపడ్డాడో ఎవ రికి అంతుపట్టడం లేదు. బిడ్డమీద మమకారంతో మనసు మార్చుకున్నాడేమో అనుకున్నారు కొందరు.

తనకా సంబంధంగాని అవకపోతే గప్‌చిప్‌గా ఎవరినైనా ప్రేమించి పెళ్లాడేస్తానని బుజ్జిబాబు తండ్రి సన్నిహితులవద్ద బాంబు పేల్చాడు. వాళ్లా విషయాన్ని ఆఘమేఘాల మీద తాతాజీకి చేరవే సారు. అంతే, దాంతో ఠారెత్తిపోయిన అతగాడు అసలుకే ఎసరొచ్చేలా ఉందనుకుని ఉన్నపళంగా పెళ్లివారికి కబురంపాడు. అదీ సంగతి.

అసలు సీక్రెటు బుజ్జిబాబుకు తప్ప మరెవరికీ తెలీదు.

**– దూరి వెంకటరావు**


చిరునామా:
దూరి వెంకటరావు, ఎం.ఎ., బిఎస్‌సి, బి.ఇడి.
25-10-30, దాసన్నపేట,
కనకాంబ నిలయం,
విజయనగరం - 535 002.